# నేత్ర పర్వం.. రాములోరి కల్యాణం

వాడ వాడలా శ్రీరామనవమి వేడుకలు

అంతటా ఆధ్యాత్మిక శోభ

కిటకిటలాడిన రామాలయాలు


జింక్ ఆంజేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రామాలయాలు భక్తులతో కళకళలాడాయి. అన్ని ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. కల్యాణ ఘట్టాన్ని కనులా వీక్షించిన భక్తులు పులకించిపోయారు.


రామ్మూర్తిపంతులుపేట సీతారామాలయంలో భక్తులు


ఆర్‌కేపురం వద్ద కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ కొణతాల సుధ

**మల్కాపురం:** జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పల్లివీధిలోని సీతారాముల ఆలయం వద్ద తొలుత హనుమాన్,లక్ష్మణ సమేత సీతా రాముల పంచ లోహ విగ్రహాలకు ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మండపం వద్ద దేవతామూర్తులను నెలకొల్పి సీతారాముల కల్యాణం వేడుకగా జరిపారు. అలాగే మల్కాపురం నగరాలవీధి వద్ద,రెడ్డివీధి వద్ద,ప్రకాష్‌నగర్ కోదండ రామాలయం ,58వ వార్డు పిలవానిపాలెం,నక్కవానిపాలెం రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరిపురం వద్ద స్వీట్‌షాప్ నిర్వాహకుడు తన షాపు వద్ద లక్ష్మణ సమేత సీతా,రాముల వేషధారణల్లో ఉన్న యువకులను నిలిపారు.

- 61వ వార్డు ఆర్‌కేపురంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని వేడుకలను తిలకించారు.
- మల్కాపురం పల్లివీధి వద్ద జరిగిన భారీ అన్న సమారాధనను మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ,అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు ప్రారంభించారు.

### కల్యాణం.. కమనీయం

**కంచరపాలెం:** జీవీఎంసీ 56,57వ వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి, 104 పరిధి రామ్మూర్తిపంతులుపేట గొల్ల కంచరపాలెం, ఆశవానిపాలెం, గవర కంచరపాలెం, తుమ్మడపాలెం, సుభాష్‌నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, శ్యామ్‌నగర్ ప్రాంతాల్లోని సీతారామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. ఆర్పీపేట మహాత్మాగాంధీ గ్రంథాలయ వద్ద గల సీతారామలింగేశ్వరాలయంలో గౌరీ సేవా సంఘం అధ్యక్ష-కార్యదర్శులు కొణతాల గోవింద రాజు, బొడ్డేటి నర్సింగరావు చిన్న ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆంజనేయశర్మ కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.

**గోపాలపట్నం:** గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ 92వ వార్డు ప్రశాంతినగర్‌లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు సీతారాములను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. బాజీ జంక్షన్, గోపాలపట్నం ప్రధాన రహదారిలోని కంపరపాలెం, నందమూరినగర్ సీతారాముల ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

### ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**సింధియా:** జీవీఎంసీ 63వ వార్డు షిప్‌యార్డ్ పాతకాలనీలోని ఉమా రామలింగేశ్వరాలయంలో రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్,స్థానిక నాయకుడు సాలాపు చిన్న దంపతులు పాల్గొన్నారు.అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ప్రారంభించారు.

### పులకించిన భక్తజనం

**విశాఖ విద్య:** లోకానికి ఆదర్శమూర్తులైన సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులారా చూసిన భక్తులు పునీతలయ్యారు. భద్రాద్రిలో రాములోరి తమ కళ్ల ముందుకొచ్చి, సీతమ్మను పరిణయమాడుతున్నారన్నట్టుగా కల్యాణ వేడుకను చూసిన భక్తజనం ఉప్పొంగిపోయారు. శ్రీరామనవమి పురస్కరించుకొని ఆదివారం వాడవాడలా జగదభిరాముడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.

- జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిపించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సీతారామ లక్ష్మణ స్వామి మూర్తులను అధిష్టింపజేసి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సూర్యనారాయణ, ఎస్. ప్రసాద రెడ్డి, డాక్టర్ శిరీష, నర్సరాజు దంపతులు స్వామి పెళ్లికి పెద్దలుగా నిలిచారు. ఎమ్మెల్యే గణబాబు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అన్నసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. సాయంత్రం తిరువీధి సేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వరసిద్ధి వినాయక ఆలయ ఫౌండర్ రాఘవేంద్ర, ఆలయ కమిటీ పెద్దలు ఐవీ శంకర్‌రావు, పి. సత్యనారాయణ, రత్నకుమారి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ పాల్గొన్నారు. అదే విధంగా రెడ్డివీధి రామాలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు చుక్కా ప్రసాద రెడ్డి భక్తులకు స్వయంగా వడ్డించారు.
- సుసర్లకాలనీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రాములోరి కల్యాణం వేడుకగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఇచ్చారపు నాగేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.భక్తులకు అన్నదానం చేశారు.


నందమూరినగర్‌లో సీతారాములను దర్శించుకున్న బెహరా భాస్కరరావు


సీతారాముల వేషధారణలో..


మల్కాపురంలో అన్నప్రసాదాలు వడ్డిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ


మల్కాపురం నగరాలవీధిలో ..


మల్కాపురం పల్లివీధిలో..


కల్యాణంలో మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్


గోపాలపట్నం ప్రశాంతినగర్‌లో తాళిబొట్టును చూపిస్తున్న పురోహితుడు


ఎమ్మెల్యే గణబాబుకు స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న నిర్వాహకులు


మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో స్వామి వారి కల్యాణోత్సవం


సీతారాముల పరిణయం వేళ పరదాల అడ్డుపెడుతున్న చిన్నారులు


పూజలందుకున్న హనుమ,లక్ష్మణ సమేత సీతారాముల విగ్రహాలు


రెడ్డివీధిరామయలం వద్ద ప్రసాదాన్ని వడ్డిస్తున్న చుక్కా ప్రసాదరెడ్డి, కార్పొరేటర్ రమణ


ప్రశాంతినగర్‌లో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## క్లుప్తంగా

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబకు హారతి ఇస్తున్న భక్తులు

**కంచరపాలెం:** కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

### ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న గజపతిరావు, బద్రీనాథ్, పాలిమేర శ్రీను తదితరులు

**మల్కాపురం:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 60వ వార్డు గుల్లలపాలెం వద్ద ఆ పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలిదిండి బద్రీనాథ్, గజపతిరావు, పాలిమేర శ్రీను ,గురుమూర్తి,దాడి రమేష్ పాల్గొన్నారు.

**సింధియా:** జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో బీజేపీ మహిళా మోర్చా స్టేట్ పోర్టల్ కన్వీనర్ లలిత, ఉత్తరాంధ్ర ఎస్సీ మోర్చా నాయకులు ములకపల్లి ప్రకాష్,మల్కాపురం మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

**విశాఖ విద్య:** అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ పని చేస్తుందని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడిద పురుషోత్తమ రమేష్ అన్నా. 52 వ వార్డులో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ మంజుల, గొట్టువాడ వెంకటేశ్వరరావు, తెలపర సత్యనారాయణ పాల్గొన్నారు

### వైభవంగా సాయిబాబా జన్మదిన తిథి వేడుకలు


విశేష అలంకరణలో సాయినాథుడు

**గోపాలపట్నం:** గోపాలపట్నం ప్రశాంతినగర్ సాయిబాబా ఆలయంలో సాయిబాబా జన్మదిన తిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, ఫలోదక, చందనోదక, సుగంధ అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. స్థానిక భక్తులు స్వామి వారికి 56 రకాల మిఠాయిలు సమర్పించారు. షిర్డీ సాయిబాబాను ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు దర్శించుకున్నారు.

# 'చిత్ర'పతి..చలపతి

- చిత్రకళా రంగంలో సుంకర చలపతిరావు కీర్తి అజరామరం
- కళారత్న అవార్డుతో ప్రభుత్వ సత్కారం

చిత్రకళను ఆస్వాదించే హృదయం కావాలి. సామాన్యుడు కూడా 'ఆహా!' అని నివ్వెరపోయే విధంగా చిత్రకళాఖండాలు సామాన్య ప్రజలకు చేరువ కావాలి. తెలుగు చిత్రకళ అనగానే దామెర్ల రామారావు పేరు తొలుతగా స్ఫురణకు వస్తుంది. ఆధునికాంధ్ర చిత్రకళకు పితామహుడాయన. ఆయన శిష్యప్రశిష్యులైన యువ చిత్రకారులు ఆయనలా చిత్రించాలని ఉవ్విళ్లూరే వారంటారు. అదొక కళా చైతన్యం. ఆధునిక తెలుగు సాహిత్యం, ఆధునిక తెలుగు చిత్రకళ ఇంచుమించు ఒకే సమయంలో మొదలయ్యాయి. రెండింటి పైన అధివాస్తవిక ధోరణుల ప్రభావం సమానంగానే ప్రతిఫలించింది. ఆధునికాంధ్ర కవిత్వంలో మాదిరే చిత్రకళలోనూ ఎన్నో పోకడలు కనిపించాయి. దామెర్లవారు పూయించిన కొత్తపూలు తెలుగునాట చిత్రకళను ఒక అధ్యయనాంశంగా అభ్యాసం చేయాలనే ఆలోచనలకు దారితీశాయి. ఆయన స్ఫూర్తితో పూర్ణానంద శర్మ వద్ద చిత్రలేఖనంలో మెళకువలు నేర్చుకుని ఓ గొప్ప చిత్రకారుడిగా సుంకర చలపతిరావు కీర్తి గడించారు. –మల్కాపురం


చిత్రకారుడు వడ్డాది పాపాయ్యతో సుంకర(ఫైల్)


చలపతిరావును సత్కరిస్తున్న ప్రముఖులు

**త**న కలం ద్వారా ఎన్నో చీకటి కోణాలను వెలికితీసి, సామాన్య ప్రజలకు న్యాయం చేసే జర్నలిస్టుగా పారిశ్రామిక ప్రాంతంలో సుంకర చలపతిరావుకు మంచి పేరుంది. జర్నలిస్టుగానే కాకుండా చిత్రకారుడుగా, రచయితగా, కవిగా చలపతిరావుకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది సందర్భంగా చిత్రకళ చరిత్ర, విమర్శలలో ఆయన చేసిన కృషికి గుర్తించి కళారత్న పురస్కారంతో సత్కరించింది.

### గుంటూరు జిల్లాలో జన్మించి..

గుంటూరు జిల్లా వెల్లటూరులో 1954లో జన్మించిన సుంకర చలపతిరావు ప్రఖ్యాత గ్రామీణ చిత్రకారుడు వెల్లటూరి పూర్ణానంద శర్మ వద్ద చిత్రలేఖనంలో మెళకువలు నేర్చుకున్నారు.1968లో వెల్లటూరులో నవరంగ్ చిత్రకళానికేతన్ అనే చిత్రకళ సంస్థలో సభ్యుడిగా చేరారు. 1971 నుంచి చిత్రకళ ప్రదర్శనలు, చిత్రకారుల గూర్చి తరచూ వివిధ పత్రికల్లో వ్యాసాలు రాశారు. సమీక్షలు చేశారు.గత 50 ఏళ్ల నుంచి ఇంత వరకు 5 వందలకు పైగా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆంధ్ర చిత్ర శిల్పులు, చిత్రకళ రత్నాలు, దామెర్ల రామారావు, వడ్డాది పాపయ్య, రవివర్మ, చిత్రకళ శిఖరాలు, చిత్రకళ వైభవం వంటి గ్రంథాలను ఆయన రచించారు. మరో పది గ్రంథాలకు ఆయన సంపాదకత్వం వహించారు.అంతే కాకుండా వివిధ ప్రత్యేక సంచికల్లో ఆంధ్ర చిత్రకళ సంబంధించిన చరిత్రను ఆయన రచించారు. పట్టణాల్లో చిత్రకళ రంగంపై ఆయన ఆకాశవాణిలో పలు ప్రసంగాలు చేశారు.



### చిత్రకళా పరిషత్ కార్యదర్శిగా..

విశాఖలో ఉన్న చిత్రకళ పరిషత్ ప్రధాన కార్యదర్శిగా 35 ఏళ్ల పాటు చిత్రకళ ప్రదర్శనలు, పోటీలు నిర్వహించి ఔత్సాహికులను ప్రోత్సహించారు.


చలపతిరావు రచించిన చిత్రకళ గ్రంథాలు

ఆయన గీసిన చిత్రాలకు అమృతసర్, హైదరాబాద్, భీమవరం తదితర పట్టణాల్లో ఏర్పాటు చేసిన పోటీల్లో బహుమతులు పొందారు. షిప్‌యార్డ్‌లో ఉద్యోగం చేస్తూ షిప్‌యార్డ్ రచయితల సంఘం స్థాపించి అనేక సాహితీ కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీగ్రామ్, మల్కాపురం, గాజువాక గ్రంథాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.ఒక జర్నలిస్టుగా ఉన్న సమయంలో 1989లో గుజరాత్‌లో జరిగిన భూకంపం బాధితులకు ప్రజలనుంచి రూ. లక్ష సేకరించారు.నగదులో పాటు బియ్యం, బట్టలు సేకరించి నాటి కలెక్టర్‌కు అందజేసి సేవాభావం చాటుకున్నారు.

# రహదారి ఆక్రమణ!

- రాకపోకలకు అవస్థలు


రహదారిపై పెట్టిన సామగ్రి

**విశాఖ విద్య:** ఎన్ఏడీ ఫ్లై ఓవర్ చుట్టూ ఉన్న దారులు మూసుకుపోతున్నాయి. ప్రజావసరాల కోసం ఉపయోగపడాల్సిన రహదారులను కొంతమంది ఆక్రమించేసి తమ సొంతానికి వినియోగిస్తున్నారు. దీంతో ఆ దారుల్లో వాహనదారుల ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. బిర్లా జంక్షన్ వైపు నుంచి హైవేపై వచ్చే వారు, అదే విధంగా ఎన్ఎస్‌టీఎల్ పరిసర కాలనీల నుంచి వచ్చే వారు కంచరపాలెం వైపు వెళ్లడానికి ఫ్లై ఓవర్ పక్కన ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్‌కు అనుసంధానంగా మరో రహదారి నిర్మించారు. ఈ మార్గంలో పాదచారులు, ద్వి చక్ర వాహనదారులు సులభంగా కంచరపాలెం, మర్రిపాలెం రైల్వే స్టేషన్‌కు చేరుకోవచ్చు. అయితే ఈ రహదారిని కొంతమంది వ్యాపారస్తులు మూసేస్తున్నారు. ఓ వైపున ఉన్న మద్యం దుకాణం వద్దకు వచ్చే మందు బాబులు సాయంత్రం నుంచి రాత్రి 10గంటల వరకు ఈ దారిలోనే మద్యం సేవిస్తూ సీసాలు పడేస్తున్నారు. అదే విధంగా అక్కడ పాత ఇనుప సామగ్రి వ్యాపారస్తులు చెత్త చెదారాన్ని రోడ్డుపైనే వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్డుపై సామగ్రి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పండగ వేళ విషాదం

- లారీ ఢీకొని వ్యక్తి మృతి


సత్యనారాయణ ( ఫైల్ )

**మల్కాపురం :** వేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపురం ప్రాంతానికి చెందిన మాచర్ల సత్యనారాయణ (45) అనే వ్యక్తి స్థానిక కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ సమీపాన పాన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీరామనవమి సందర్భంగా అల్లిపురంలో తన కుమార్తె ఇంటికి సత్యనారాయణ ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై మారుతీ సర్కిల్ మీదుగా వెళ్తున్నాడు. ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా గల సేవా మార్గం వద్దకు రాగానే అదే సమయంలో నక్కపల్లి నుంచి వస్తున్న లారీ సత్యనారాయణ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సత్యనారాయణ మృతితో భార్య, కుమారుడు, కుమార్తె బోరున విలపించారు.

### అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.



# మే 20న జాతీయ సమ్మె

**ఉక్కునగరం:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా.. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల నాయకత్వ నిర్మాణ వర్క్ షాప్‌లో ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని అన్నారు. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. ప్రజల త్యాగాలతో నిర్మించిన సీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీ, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులు ఇలా దేశ ఆర్థిక మూలాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఫార్మా, రసాయన పరిశ్రమలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# వాకర్స్ పార్కు అభివృద్ధికి సహకారం

**మురళీనగర్:** మురళీనగర్ వాకర్స్ క్లబ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన నెలవారీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు క్రమశిక్షణ, సేవా భావానికి మారుపేరుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పార్కులో ప్రస్తుతం ఉన్న ఔషధ మొక్కలకు అదనంగా కొత్త మొక్కలు పెంచాలని సూచించారు. వేసవిలో నీటిని వృథా చేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. పార్కులోని గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ పత్రికను జేడీస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.